క్లుప్తంగా

వధూవరులకు ఎమ్మెల్యే వసంత ఆశీస్సులు



ఇబ్రహీంపట్నం: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమోతు ప్రకాష్ కుమార్తె ప్రియాంక, ఇమ్రానియేల్ ప్రిన్స్ వివాహం ఇటీవల జరిగింది. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రకాష్ నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆదివారం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన నల్లమోతు శ్యాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



ఇబ్రహీంపట్నం: సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాతో మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్న ఇబ్రహీంపట్నానికి చెందిన చనుమోలు భారతికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు రూ.1.30 లక్షల చెక్కును లబ్ధిదారుడి కుటుంబ సభ్యుడికి ఆదివారం అందజేశారు. కొండపల్లి సచివాలయాల కన్వీనర్ లంకే అంకమోహనరావు, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్న బోసు, పండు, మేడా రాధ, బత్తుల కృష్ణ, రాజేష్, పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు 157 మంది హాజరు



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సర్వోదయ యూపీ స్కూల్లో వార్షిక పరీక్షలు నిర్వహించారు. పరిచయ్ నుంచి ప్రవీణ వరకు మొత్తం ఏడు స్థాయిలలో ఈ పరీక్షలు జరగగా, 157 మంది హాజరైనట్లు ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. పరిచయ్ పరీక్షకు 14మంది, ప్రాథమికకు 44, మధ్యమకు 25, రాష్ట్ర 27 ప్రవేశిక 9, విశారద 7, ప్రవీణ 10 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

13న మారెమ్మ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన హుండీ కానుకలను ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, ఆలయ ఈఓ సీతారామయ్య ఆదివారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తల కమిటీ సభ్యులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, భక్తుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

క్యాత్ ల్యాబ్ ప్రారంభం

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రిలో అత్యాధునిక క్యాత్‌ల్యాబ్‌ను ఆదివారం ప్రారంభించారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు అత్యవసర చికిత్స అందుబాటులోకి తీసుకురావాలనే ధ్యేయంతో అత్యంత ఖరీదైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పీ రమేష్‌బాబు తెలిపారు. తమ ఆస్పత్రిలో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటు ఎంఎస్ సి.టి. స్కాన్ ద్వారా బ్రెయిన్ యాంజియో, క్యాన్సర్ డిటెక్షన్, న్యూరో, ఆర్థో, ట్రామా రోగులకు అత్యవసర చికిత్స అందిస్తామని చైర్మన్ కోనేరు వెంకటకృష్ణన్ తెలిపారు.

మైలవరం చేరుకున్న సైకిల్ యాత్ర



మైలవరం: విద్యా రంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ఆదివారం మైలవరం చేరుకుంది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు అజయ్ కుమార్, చరణ్, కార్తీక్, వేదలు స్థానిక ఎల్‌బీఆర్‌సీఈ కళాశాల వద్ద స్వాగతం పలికారు. అనంతరం మైలవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ నారాయణ నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాల, బాలికల హాస్టల్, బాలుర వసతి గృహం వద్దకు చేరుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా గరల్స్ కన్వీనర్ ఎస్‌కే జాబితా, నాయకులు మన్మథ పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ ప్రతిష్ట



తిరువూరు కోదండరామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం



చెక్కపల్లిలో కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట

ముసునూరు: చెక్కపల్లిలో కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమద్ సమేత సీతా, లక్ష్మణ, ద్వార, క్షేత్ర పాలకుల విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని సంప్రదాయ సిద్ధంగా ప్రతిష్ఠించారు. మండలంలోని చెక్కపల్లి దివాణం సెంటర్‌లో నిర్మించిన కోదండ రామాలయంలో మూడు రోజులుగా అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రామ నామస్మరణ, పురోహితుల వేద మంత్రోచ్ఛరణలు, బాజాభజంత్రీల మేళతాళాల నడుమ ఆదివారం స్వామి ఆలయ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

రామాలయంలో చాలీసా పారాయణం

తిరువూరు: శ్రావణ మాస పునర్వసు నక్షత్ర సందర్భంగా తిరువూరు శ్రీకోదండ రామాలయంలో ఆదివారం రాత్రి 21 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. శ్రీకోదండరామస్వామికి, ఆంజనేయ స్వామికి విశేషపూజలు నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు చాలీసా పారాయణం చేశారు. మూల విరాట్టులకు తిరుమంజనం, గోధుమ ప్రసాదం సమర్పించారు. ఆలయ అర్చకులు పార్థసారథాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ల కొరత సమస్య పరిష్కారానికి కృషి

ముసునూరు: ముసునూరు బాలికల గురుకులంలో టీచర్ల కొరత పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ హామీ ఇచ్చారు. పేరెంట్స్‌డే సందర్భంగా ఆదివారం పాఠశాలకు హాజరైన విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులంలో టీచర్ల కొరతపై ఫోన్ ద్వారా ఆయనకు తెలిపారు. తక్షణమే స్పందించిన ఆయన విద్యాలయానికి చేరుకుని ప్రిన్సిపాల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యామినీదేవి పాఠశాల విద్యా ప్రగతిని వివరించి, అవసరమైన వసతులను ఆయనకు వివరించారు. శాశ్వత సిబ్బంది కొరత ఉందని, గెస్ట్ టీచర్లతో విద్యాబోధన కొనసాగిస్తున్నామని వివరించారు. ఈ విషయాన్ని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యుడు విద్యార్థినుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.



బాలికల గురుకుల పాఠశాల్లో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్

విశ్వనాథ రచనలు భావితరానికి స్ఫూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విశ్వనాథ రచనలు భావితరానికి స్ఫూర్తి అని వక్తలు తెలిపారు. ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి కార్యక్రమం జరిగింది. మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయం ఉపాధ్యక్షుడు డి.సత్యనారాయణరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరాజు, డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజుతో కలిసి విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత విశ్వనాథ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె. ప్రసాదరాజు, వి.సింగంరాజు, బాపిరాజు, టి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సమస్యకు.. చావు పరిష్కారం కాదు

డాక్టర్ ఆర్‌కే అయోధ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏ సమస్యకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఆర్‌కే అయోధ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇటీవల మానసిక ఒత్తిడులు అధికమయ్యాయన్నారు. ప్రతి గంటకు పదులు సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పనికిరాం అనే భావనతో ఉన్నవారు, నిరాశవాదం, నాకు ఎవరూ సాయం చేయరూ...? అనే భావనలతో ఉన్నవారు ఆ ఒత్తిడిని ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఏటా దేశంలో లక్షన్నర మంది ఆత్మహత్యలకు గురై అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకోవటానికి కూడా ధైర్యం కావాలన్నారు. ఆ ధైర్యాన్ని సమస్యలను ఎదుర్కొనేందుకు ఉపయోగించి ఆశతో ముందడుగు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయని వివరించారు. మానసిక సమస్యలు, కారణాలు, ఆత్మహత్యలు తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరిభాషలో పలు శాస్త్రీయ పేర్లు ఉన్నా యువత ఎక్కువగా ఈ సమస్యలకు గురవుతున్న విషయాలను సర్వేలు తెలియజేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ ఎడిక్షన్ సమస్యలు ఇటీవల అధికమయ్యాయన్నారు. ఎంతో కోల్పోయామనే భావనను చుట్టుపక్కల వ్యక్తుల వద్ద వ్యక్తం చేస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తులు తారసపడినప్పుడు వారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ యువత ఇలాంటి చర్యల ద్వారా వారు తమ వ్యక్తిగత జీవితాన్ని బలి చేసుకోవటమే కాకుండా కుటుంబానికి తీరని వ్యథను మిగుల్చుతున్నారన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ఇతర మార్గాలను అన్వేషించాలుగానీ ఆత్మహత్యకు పాల్పడవద్దని సూచించారు. యువతలో గొప్ప శక్తియుక్తులు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ వీఎస్‌రావు స్వాగతం పలకగా, మరో పీఓ ఎన్.సాంబశివరావు వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్కే అయోధ్య



హాజరైన విద్యార్థులు

ఉరుసు మహోత్సవం ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో సుఖశాంతులు వర్ధిల్లాలంటే వలి అల్లా చల్లని దీవెనలు అవసరమని సూఫీ పండితుడు సయ్యద్ నజీరుద్దీన్ బాబా పేర్కొన్నారు. పాతబస్తీ పంజా సెంటర్‌లోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా 102వ ఉరుసు మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. నజీర్‌ఉద్దీన్ దర్గా ముజావర్ల సన్మానం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక నగరాల్లో వలి అల్లా దర్గాలు సర్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీకలన్నారు. పాతబస్తీలోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి రెహమతుల్ ఆలై లోటే సోటె వాలే బాబా అనేక అద్భుతాలు ఆవిష్కరిస్తూ అందరి కోర్కెలను అల్లాహ్ అనుగ్రహంతో నెరవేరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దర్గా ముజావర్లు బాబు, షమి, జిలానీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



దర్గాను దర్శించుకున్న సూఫీ పండితులు సయ్యద్ నజీరుద్దీన్

ఘనంగా కల్యాణ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట శ్రీ కల్యాణ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం మందిర వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు, అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు పగడాల మధుసూదనరావు పర్యవేక్షించారు.



నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 11న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న స్పందనలో డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు అందించిన అర్జీలను గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిననాగయ్య పురస్కారాల ప్రకటన

తిరువూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.చిననాగయ్య స్మారక పురస్కారాలను పలువురు రచయితలకు అందజేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు. చిననాగయ్య స్మారక ట్రస్టు కన్వీనర్ రాంప్రదీప్ తెలిపిన వివరాల ప్రకారం వ్యాసాల విభాగంలో ఎం తిరుపతిరావు(రాజాం), ఎల్ఆర్ వెంకటరమణ (అనంతపురం), కవిత్వ విభాగంలో సీత(భద్రాచలం), నీలిమ(హైదరాబాద్), జయరావు(నెల్లూరు), కథల విభాగంలో అనురాధ(విజయవాడ), సుగుణరావు(విశాఖపట్నం), సుబ్బారావు(నూజివీడు), కళాగోపాల్(నిజామాబాద్), చరిత్ర విభాగంలో అజీజ్(కర్నూలు) ఎంపికైనట్లు తెలిపారు. విజేతలకు అక్టోబరులో తిరువూరులో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందజేస్తామని రాంప్రదీప్ పేర్కొన్నారు.

11 కేవీ విద్యుత్ లైన్ పనులు ప్రారంభం

తిరువూరు: మండలంలోని గానుగపాడు–లక్ష్మీపురం గ్రామాల నడుమ 11 కేవీ విద్యుత్ లైన్ పనులు ఆదివారం ప్రారంభించారు. విద్యుత్ లైన్ నిర్మాణంతో వ్యవసాయ అవసరాలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయవచ్చని అధికారులు తెలిపారు. ఆంజనేయపురం గ్రామ పరిధిలో ఈ విద్యుత్‌లైన్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు పరిశీలించారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యకర సమాజ స్థాపనకు.. దాతల సహకారంతో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యసేవలు అందిస్తున్నామని ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ నగరంలోని వృద్ధులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి అవగాహన, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అల్లోపతి వైద్యులు చంద్రభొట్ల ఆదిత్య, ఆయుర్వేద డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో డాక్టర్ కిషోర్ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఆదివారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయంలోని శ్రీ శివకామేశ్వరికి శ్రావణ మాసం పురస్కరించుకుని కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిగింది. నీలకంఠేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

ఫుట్‌బ్రిడ్జిపై వీధి దీపాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ ఫుట్‌బ్రిడ్జిపై వీధి దీపాలను ఆదివారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఏర్పాటు చేయించారు. ఇటీవల మధురానగర్ వచ్చిన సందర్భంగా ఫుట్‌బ్రిడ్జి వద్ద చీకటిగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడటాన్ని ఎమ్మెల్యే గమనించారు. అధికారులతో మాట్లాడి సత్వరమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. మల్లాది విష్ణు ఆదేశాల మేరకు రెండు వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

రూ. 5.5 కోట్లతో పప్పులమిల్లు వద్ద వంతెన

స్థానిక అవసరాలు రద్దీ నివారణకు మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ వద్ద వంతెన నిర్మాణ పనులకు రూ. 5.5 కోట్లను ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంజూరు చేయించారు. త్వరలోనే టెండర్లు పిలిచి వంతెన పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పాఠశాల క్రీడల్లో విజేతలు వీరే

తిరువూరు: తిరువూరు మండల స్థాయి పాఠశాలల క్రీడలు ఆదివారం ముగిశాయి. బాలబాలికల అండర్–14, అండర్–17 టోర్నమెంట్స్ స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జరిపినట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్–14 బాలికల కబడ్డీలో మల్లేల, మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. ఖోఖోలో మునుకుళ్ల, మల్లేల, వాలీబాల్‌లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల గెలుపొందినట్లు తెలిపారు. అండర్–17 బాలికల కబడ్డీలో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల, నారాయణ హైస్కూల్, ఖోఖోలో తిరువూరు బాలికోన్నత పాఠశాల, శ్రీనిధి హైస్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందాయని ప్రకటించారు.



మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలైన బాలికల ఉన్నత పాఠశాల జట్టు

ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలకాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి చట్టం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలోని శ్రీనివాస సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని రెండో రోజైన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలు న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు వెంపటి వెంకటేశ్వర మాదిగ, ముళ్లపూడి వెంకటేశ్వర మాదిగ, ఏలూరు జిల్లా ఎమ్మెస్పీ కో కన్వీనర్ తొమ్మండ్రు రుద్రయ్య మాదిగ, కలపాల విలియమ్స్, జయరాజ్, రోహిత్, రవికుమార్, రాముడు, ఏసు, రమేష్, బోసు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మకు ఘన నివాళి

విస్సన్నపేట: భూమికోసం, భుక్తికోసం తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న వీర వనిత చిట్యాల ఐలమ్మ అని రజక జనసేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేటీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు లెక్చరర్ ముంగా జయరాజు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కంకట మోహనరావు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం, సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు, శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక జనసేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

బీమా ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభం

ముసునూరు: మండల వ్యాప్తంగా లోపూడి, చెక్కపల్లి, గుళ్లపూడి, రమణక్కపేట గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ డా.వరికూటి ప్రతాప్ కార్యక్రమ విధి విధానాలపై ఆయా గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలు, కమిటీలకు ఆదివారం దిశా నిర్దేశం చేసి, ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలను పూర్తి చేశారు. వైస్ ఎంపీపీ రాజానాయన, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, పేరం కృష్ణ, ఆర్ శ్రీదేవి శ్రీనివాస్, రంగు ధనలక్ష్మీగాంధీ, ఉప సర్పంచ్‌లు పద్మజా రాంబాబు, పద్మజా దేవేంద్ర, రంగు సత్యనారాయణ పాల్గొన్నారు.



రమణక్కపేటలో ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్

వైభవంగా శ్రీనివాస కల్యాణం

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పేద పండితుల మంత్రాల నడుమ శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆ తరువాత లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది.



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మహిళలు విద్యావంతులు కావాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు విద్యావంతులుగా మారి హక్కుల కోసం పోరాడినప్పుడే మహిళాసాధికారత సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాల్లో ఆదివారం రోటరీ మిడ్ టౌన్ విజయవాడ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. దగ్గుపాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై ఆధునిక యుగంలో పరిపూర్ణ మహిళ అనే అంశంపై ఆమె మాట్లాడారు. నిన్న, నేడు, రేపు ఎప్పుడైనా మహిళలు పరిపూర్ణురాలేనని చెప్పారు. తల్లిగా, చెల్లిగా, అక్కగా, స్నేహితురాలిగా, సహోద్యోగిగా, భార్యగా ఇలా ఎన్నో పాత్రలను మహిళలు నిజ జీవితంలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్స్ అధినేత అక్కినేని మణి మరోఅతిథిగా హాజరై మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సందు వీఆర్ సాద్ మాట్లాడుతూ నెలాఖరులో అన్ని రోటరీ కబ్స్‌లోని సభ్యులందరికీ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. బ్యాడ్మింటన్ పోటీల లోగోను అతిథులు ఆవిష్కరించారు. క్లబ్ సభ్యులు పురందేశ్వరిని సత్కరించారు.



బ్యాడ్మింటన్ పోటీల లోగోను ఆవిష్కరించిన పురందేశ్వరి

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నదీ జలాలతో సంప్రోక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగళా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామికి అన్నపూర్ణాదేవికి కళాకర్షణ, సమస్త నదీ జలాలతో సంప్రోక్షణ జరిగింది. రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి మూలమంత్ర హోమాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ యం.వి. సురేష్ బాబు, కాకినాడ జోన్ ఉపకమిషనర్ మేడిపల్లి విజయరాజు, విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఆలయవంశపారంపర్య ధర్మకర్తలు, స్థానిక పెద్దలు, దాతలు భక్తులు పాల్గొన్నారు.